# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 15-02-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- "వికసిత్ భారత్" లక్ష్యాన్ని చేరుకోవడంలో యువత పాత్ర కీలకమని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.
- భారత్ గతంలో ఎన్నడూ లేని విధంగా ఆర్థికాభివృద్ధిని చూస్తోందని ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు.
- ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసే దిశగా ఉక్రెయిన్ దేశంతో చర్చలు జరిపినట్టు విదేశీ వ్యవహారాల శాఖా మంత్రి ఎస్. జై శంకర్ తెలిపారు.
- మైనింగ్ రంగంలో సంబంధాలను పెంపొందించే లక్ష్యంతో భారత్ - శ్రీలంక దేశాల మంత్రులు ఈరోజు న్యూఢిల్లీలో కీలక చర్చలు జరిపారు.

========================

"వికసిత్ భారత్" లక్ష్యాన్ని చేరుకోవడంలో యువత పాత్ర కీలకమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. రాంచీ పర్యటనలో భాగంగా బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (BIT) మెస్రా ప్లాటినం జూబ్లీ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ… BIT మెస్రా తూర్పు భారతదేశంలో సాంకేతిక విద్యలో అగ్రగామి సంస్థ అని పేర్కొన్నారు. ఈ సంస్థ ద్వారా అనేక మంది బాలికలు సాంకేతిక రంగంలో ప్రతిభను కనబర్చారని అన్నారు. సాంకేతిక రంగంలో ఆవిష్కరణలను ప్రోత్సహించవలసిన ఆవశ్యకత ఉందని చెప్పారు. కృత్రిమ మేధ ప్రజల జీవితాలను మార్చడంలో ఎంతగానో సహాయపడుతుందని రాష్ట్రపతి పేర్కొంటూ …

(వాయిస్ 38 సెకన్లు)

కార్యక్రమంలో భాగంగా రాష్ట్రపతి సంస్థ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన, పరిశోధన, అభివృద్ధి ప్రదర్శనను ప్రారంభించారు. పూర్వ విద్యార్థులకు పురస్కారాలను ప్రదానం చేశారు. సంస్థ ఘన చరిత్రను తెలియజేసే ఫౌండేషన్ డే సావనీర్ ను కూడా విడుదల చేశారు.

========================

ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతోన్న మహాకుంభమేళాకు ఇప్పటి వరకు 50 కోట్ల మందికి పైగా భక్తులు వచ్చి త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారని ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం వెల్లడించింది. ఇంకో 11 రోజుల్లో ఈ మహా కుంభమేళా ముగియనున్న నేపథ్యంలో భక్తుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతూనే ఉంది. కుంభమేళాకు పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారనే అంచనాలతో ఉత్తరప్రదేశ్ రాష్ట్ర రవాణా సంస్థ వచ్చే 3 రోజుల్లో 2 వేల 250 అదనపు బస్సులను నడుపుతున్నట్లు ప్రకటించింది. కుంభమేళాకు వారాంతంలో పెద్ద సంఖ్యలో భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు చేరుకుంటారు. ప్రయాణీకుల సౌకర్యార్థం రాష్ట్ర రవాణా సంస్థ అదనపు బస్సులను ఏర్పాటు చేసింది.

========================

భారత్ - ఉక్రెయిన్ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసే దిశగా ఆ దేశ విదేశాంగ మంత్రి ఆండ్రీ సైబిహాతో చర్చలు జరిపినట్టు విదేశీ వ్యవహారాల శాఖా మంత్రి ఎస్. జైశంకర్ తెలిపారు. ఉక్రెయిన్ వివాదాన్ని పరిష్కరించి, అక్కడ శాంతిని నెలకొల్పడం... తమ మధ్య జరిగిన చర్చల్లో ప్రధాన్యతా అంశంగా నిలిచిందని ఆయన ఒక సామాజిక మాధ్యమం ద్వారా వెల్లడించారు. కాగా... ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రీ సైబిహా... భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఉక్రెయిన్‌లో శాంతి స్థాపనకు భారత్ సహాయం అందించడాన్ని ఆయన సమాజిక మాధ్యమం వేదికగా కొనియాడారు. వాణిజ్యం, సాంకేతికత, వ్యవసాయం, భద్రత, తదితర రంగాలలో భారతదేశంతో సహకారాన్ని పెంపొందించుకోవడానికి ఉక్రెయిన్ సన్నద్ధతను ఆయన తెలియజేశారు.

========================

కీలక ఖనిజాల అన్వేషణ, మైనింగ్‌లో ఇరుదేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేసే లక్ష్యంతో భారత్ - శ్రీలంక దేశాల మధ్య చర్చలు జరిగాయి. కేంద్ర గనుల శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబే ఈరోజు న్యూఢిల్లీలో శ్రీలంక పరిశ్రమలు, వ్యవస్థాపకత అభివృద్ధి మంత్రి సునీల్ హందున్నెట్టితో సమావేశమయ్యారు. ఖనిజాల అన్వేషణ, మైనింగ్‌లో ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించడంపై ప్రధానంగా దృష్టి సారిస్తూ.. రెండు దేశాల ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన కీలక ఖనిజాలను పొందడం లక్ష్యంగా చర్చలు కొనసాగాయి. ఈ సందర్భంగా సతీష్ చంద్ర దూబే మాట్లాడుతూ... భారత్ పునరుత్పాదక ఇంధన లక్ష్యాన్ని చేరుకోవడానికి లిథియం, గ్రాఫైట్, నికెల్, కాపర్ వంటి కీలక ముడి పదార్థాలను స్థిరంగా పొందడం జాతీయ క్రిటికల్ మినరల్ మిషన్ లక్ష్యమని స్పష్టం చేశారు. అంతర్జాతీయ భాగస్వామ్యాలను ఏర్పరచుకుని, ప్రపంచ వ్యాప్తంగా ఖనిజాలను పొందేలా భారతీయ సంస్థలను ప్రోత్సహించడం జరుగుతుందని కేంద్ర మంత్రి తెలియజేశారు.

విరామం

========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 119వ సంచిక ఈనెల 23వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు  ఈనెల 21వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

========================

భారతదేశం గతంలో ఎన్నడూ లేని విధంగా ఆర్థికాభివృద్ధిని చూస్తోందని ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు. జమ్ములోని శ్రీ మాతా వైష్ణోదేవీ విశ్వవిద్యాలయం 10వ స్నాతకోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడి విద్యార్థులను ఉద్దేశించి ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ... ఇప్పటి విద్యార్థులు చాలా అదృష్టవంతులని, గతంలో ఇటువంటి పరిస్థితులు లేవని అన్నారు. రవీంద్రనాథ్ ఠాగూర్ చెప్పిన విధంగా భయం

అవసరంలేని స్థితిలో స్వేచ్ఛా వాతావరణంలో ఇప్పుడు పరిస్థితులు ఉన్నాయన్నారు. అభివృద్ధి, పెట్టుబడులు, అవకాశాలకు గమ్యస్థానంగా భారత్‌ను ప్రపంచ దేశాలు గుర్తిస్తున్నాయని పేర్కొన్నారు. 3వ సారి వరుసగా ప్రధానమంత్రిగా ఎన్నికైన నరేంద్ర మోదీని ప్రపంచ నాయకుడిగా చూస్తున్నారని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు.

(వాయిస్ 35 సెకన్లు)

========================

బోడో వర్గానిరి సాధికారత కల్పించేందుకు కేంద్రంలోనూ, అస్సాంలోనూ ఉన్న ఎన్డిఏ ప్రభుత్వాలు అవిశ్రాంతంగా పని చేస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలియజేశారు. బోడోల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ఈ ప్రయత్నాలు మరింత బలంగా కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. కోక్రాఝర్‌లో జరిగే ఒకరోజు అసెంబ్లీ సమావేశానికి సంబంధించి అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ సామాజిక మాధ్యమంలో పోస్టుపై ప్రధాన మంత్రి ఈ విధంగా స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా... ఈ నెల 17వ తేదీన కోక్రాఝర్‌లో ఒకరోజు ప్రత్యేక అసెంబ్లీ సమావేశం జరగనుండడాన్ని ఆయన కొనియాడారు.

========================

సైబర్ నేరాల కేసుకు సంబంధించి సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) ఢిల్లీ, హర్యానాలోని 11 చోట్ల సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో కోటి రూపాయల నగదు, వెయ్యి డాలర్ల విలువైన విదేశీ కరెన్సీ, బంగారాన్ని సీబీఐ స్వాధీనం చేసుకొంది. ఈకేసులో నిందితులు ప్రభుత్వ అధికారులుగా నమ్మబలికి క్రిప్టో కరెన్సీకి సంబంధించిన మోసాలకు, అక్రమాలకు పాల్పడుతున్నారని సీబీఐ పేర్కొంది. క్రిప్టో కరెన్సీ రూపంలో విదేశాలకు డబ్బును బదిలీ చేయడం ద్వారా నిందితులు దేశ విదేశాల్లో మోసాలకు పాల్పడ్డారని గుర్తించినట్టు తెలియజేసింది. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులపై సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది.

========================

భారత ఇంధన రంగం అభివృద్ధిలో కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి పాత్ర కీలకమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. హర్దీప్ సింగ్ పూరి జన్మదినం సందర్భంగా ప్రధానమంత్రి ఆయనకు సామాజిక మాధ్యమం వేదికగా ఈరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. పెట్రోలియం, సహజ వాయువు సంబంధిత కార్యక్రమాలకు భారతదేశాన్ని కేంద్రంగా మార్చడంలో ఆయన కీలకంగా వ్యవహరించారని, దేశ స్వావలంబనకు ఇది ఎంతో ఆవశ్యకమని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఆయన దీర్ఘకాలం ఆరోగ్యంగా జీవించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. అలాగే... కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా కూడా హర్దీప్ సింగ్ పూరి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

========================

కాశీ తమిళ సంగమం 3వ సంచిక ఈరోజు వారణాసిలోని నమో ఘాట్‌లో ప్రారంభమైంది. సిద్ధ వైద్య విధానం, తమిళ సాహిత్యం, దేశ సాంస్కృతిక ఐక్యతలకు అగస్త్య మహర్షి చేసిన సహాయాన్ని తెలియజేసే ఉద్దేశ్యంతో 10 రోజుల కార్యక్రమం జరగనుంది.

========================
========================